క్లుప్తంగా

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం సామాజిక బాధ్యతగా భావించాలని ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు బి.రామకృష్ణారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాతలే ప్రాణదాతాలన్నారు. రక్తం దానం చేయడం అంటే ప్రాణదానం చేయడమేనని తెలిపారు. రక్తదానంపై అపోహలు విడనాడి ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ కౌన్సిలర్ అప్పలనాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



డి.తాళ్లవలసలో సీసీ పుటేజిని పరిశీలిస్తున్న ఎస్ఐ సన్యాసినాయుడు తదితరులు

డెంకాడ: నేర పరిశోధనలో సీసీ కెమెరాలు చాలా ఉపయోగపడతాయని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని డి.తాళ్లవలస గ్రామంలోని ప్రధాన కూడలిలో గ్రామ పెద్దల సహకారంతో డెంకాడ పోలీసులు సీసీ కెమెరాలను బుధవారం ఏర్పాటు చేశారు. వీటిని ఎస్ఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కెమెరాల పనితీరును ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పలు నేరాల విచారణకు సీసీ పుటేజీలు కీలకంగా ఉపయోగపడతాయని వివరించారు.

మొక్కజొన్న సాగుకు యాజమాన్య పద్ధతులు



మొక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నీలిమ

పూసపాటిరేగ : మొక్కజొన్న సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కె.నీలిమ అన్నారు. మండలంలోని చౌడువాడ, గోవిందపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు మొక్కజొన్న సాగుపై బుధవారం అవగాహన చేసారు. నీటి యాజమాన్యం, సస్యరక్షణపై రైతులకు వివరించారు. మొక్కజొన్నను ఆశిస్తున్న కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్షాభావ పరిస్థితులు వున్న చోట అపరాలు సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జిలు పార్థసారధి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



కొండగుంపాంలో పశువులకు చికిత్సలు అందిస్తున్న వైద్యులు

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని ఏడీ డాక్టర్ చక్రవర్తి, మండల పశు వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని కొండగుంపాం, ఒమ్మి గ్రామాల్లో బుధవారం పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి పశువులను తనిఖీ చేసి ఉచితంగా మందులు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు రెండు గ్రామాల చొప్పున ఈ నెల 31 వరకు అన్ని గ్రామాల్లో పశువైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందు పంపిణీ, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని రైతులు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అంబళ్ల అప్పలనాయుడు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రావాలమ్మ జాతర

కొత్తవలస: మండలంలోని కొత్తసుంకరపాలెంలో గ్రామదేవత రావాలమ్మ తీర్థం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ప్రతిరూపమైన పూజారమ్మకు 101 బిందెల ముర్రాటతో స్నానం చేయించి.. గరిడీలు, తప్పెడగుళ్లు,కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించారు. అనంతరం సాయంత్రం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పడకేసిన పర్యాటకం

- ప్రారంభించకుండానే శిథిలమైన పర్యాటక భవనాలు
- అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా భవనాలు
- కన్నెత్తి చూడని పర్యాటకశాఖ అధికారులు



నిర్వహణకు నోచుకోని చింతపల్లి టూరిజం భవనాలు

పూసపాటిరేగ: మండలంలోని తీరప్రాంతమైన చింతపల్లి బీచ్‌లో నిర్మించిన పర్యాటక భవనాలకు చెదలు పట్టాయి. 2016వ సంవత్సరంలో సుమారు రూ.90 లక్షలతో నిర్మించిన భవనాలు ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరాయి. ఈ భవనాలు నిర్వహణకు నోచుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. చింతపల్లి బీచ్‌కు సంవత్సరం పొడవునా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. బీచ్‌లో నిలువ నీడలేకపోవడంతో పాటు కనీసం తాగునీటి సౌకర్యం కూడా ఉండదు. బీచ్ సమీపంలో బ్రిటీష్‌కాలం నాటి లైట్‌హౌస్, తిరుమల ఫ్యూజిటిక్ వంతెన పర్యాటకులను కట్టి పడేస్తాయి. కానీ చింతపల్లి బీచ్‌లో మాత్రం పర్యాటకులు కనీస మౌలిక సదుపాయాలకు దూరంగా గడుపుతున్నారు. చింతపల్లి బీచ్‌లో నిర్మాణాలు పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలమవుతున్నాయి. చింతపల్లి బీచ్‌లో 2016వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం హయాంలో పర్యాటక ఉత్సవాలు జరిపి సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేశారు. ఎటువంటి ప్రయోజనం లేకుండానే ఉత్సవాల పేరిట నిధులు దుబారా చేశారు. నిత్యం వందలాది మంది పర్యాటకులు చింతపల్లి బీచ్‌కు వస్తున్నప్పటికీ పర్యాటక భవనాలు నిర్వహణకు నోచుకోకపోవడం, రిసార్ట్స్ పనిచేయకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పర్యాటక భవనాల నిర్వహణపై సారించాలని పర్యాటకులు కోరుతున్నారు.

వెనుదిరుగుతున్న పర్యాటకులు

చింతపల్లి బీచ్‌కు వచ్చిన పర్యాటకులు ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకపోవంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. లక్షలాది రుపాయలతో నిర్మించిన పర్యాటక భవనాలు నిర్వహణకు నోచుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. వందల సంఖ్యలో పర్యాటకులు వస్తున్నప్పటికీ పర్యాటకశాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. జిల్లాలోనే ఏకైక తీరప్రాంతం అయిన చింతపల్లిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి.

బర్రి చినప్పన్న,
చింతపల్లి గ్రామప్రజాప్రతినిధి

వందల సంఖ్యలో వస్తున్న పర్యాటకులు

చింతపల్లిబీచ్‌కు నిత్యం వందల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. బీచ్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నప్పటికీ పర్యాటకశాఖ అధికారులు చేసింది శూన్యం. ప్రభుత్వ నిధులతో నిర్మించిన పర్యాటక భవనాలు, రిసార్ట్స్‌ను గాలికి వదిలేశారు. భవనాలు ప్రారంభించకుండానే చెదలు పట్టాయి. కనీసం సెక్యూరిటీ గార్డులను కూడా పర్యాటక శాఖ అధికారులు నియమించ లేదు. పర్యాటక శాఖ నిధులను అవసరమైన చోట వినియోగించాలి.

కె.వెంకట రమణ,
పర్యాటకుడు, విజయనగరం

ఏకాగ్రతతో చదవాలి




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు చదువుపై ఏకాగ్రతను పెంచుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎస్ఐ బి.గణేష్ అన్నారు. మండలంలోని మొయిద ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వలన యువత బంగారు భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. ప్రాథమిక స్థాయిలో చదువుపై దృష్టి సారిస్తే భవిష్యత్తు బంగారు బాట అవుతుందన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకొని తెలియని వారికి చెప్పి వారిలో చైతన్యాన్ని తీసుకురావాలన్నారు. సెల్‌ఫోన్లను మంచికే వినియోగించాలని, అనవసరపు విషయాల జోలికి పోయి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని హితవు పలికారు. విద్యార్థులు సామాజిక బాధ్యతను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

24న తపాలా శాఖ మెగామేళా

- పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్



మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్

విజయనగరం టౌన్: జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 24న జిల్లాలోని అన్ని తపాలా శాఖ కార్యాలయాల్లో మెగా మేళాను నిర్వహిస్తున్నామని పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించనున్న మెగామేళాలో 2వేల సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను కొత్తగా తెరవాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. పదేళ్లలోపు వయసు కలిగిన బాలికలకు ఈ ఖాతాను తెరవచ్చన్నారు. 21 ఏళ్ల కాలపరిమితి ఉంటుందన్నారు. అందుబాటులో ఉన్న తపాలా కార్యాలయాల్లో జమ చేసుకోవచ్చని, ఏ తపాలా కార్యాలయానికైనా బదిలీ చేసుకునే సదుపాయం ఉందన్నారు. వివరాలకు అందుబాటులో ఉన్న తపాలా కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

వెల్‌నెస్ క్లినిక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వెల్‌నెస్ క్లినిక్‌ను ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెల్‌నెస్ సెంటర్‌లో రోగి యొక్క మొత్తం ఫిజికల్ అసెస్‌మెంట్ అంచనా వేయడం జరుగుతుందన్నారు.

ప్రభుత్వం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర పద్మలీల మాట్లాడుతూ వెల్‌నెస్ క్లినిక్‌లో పోషణ, శారీరక శ్రమ, ధూమపానం, మద్యపానంకు దూరంగా ఉండడం గుర్తించి, ఒత్తిడిని తగ్గించుకునే మార్గాలపై కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రతి సోమ, బుధవారాల్లో వెల్‌నెస్ క్లినిక్‌లో ఓపీ నిర్వహించనున్నట్టు తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, కమ్యూనిటీ మెడిసిల్ హెచ్ఓడీ డాక్టర్ దేవిమాధవి తదితరులు పాల్గొన్నారు.

- సంక్రాంతి లోగా రహదారులకు మరమ్మతులు చేస్తామన్న కూటమి నాయకులు
- పండగ పూర్తయినా పత్తా లేని ప్రజా ప్రతినిధులు
- ప్రజలకు తప్పని ప్రయాణ కష్టాలు



రాళ్లు తేలిన కృష్ణాపురం రోడ్డు

అధ్వాన రహదారులపై.. రాకపోకలెలా..?

శృంగవరపుకోట: నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొన్నిచోట్ల రాళ్లు తేలి నడవడానికే ఇబ్బందిగా ఉంటే.. మరికొన్ని చోట్ల గోతులతో నిండి ప్రమాదాలకు స్వాగతం పలుకుతున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..సంక్రాంతి నాటికి గోతుల్లేని రహదారులను ఏర్పాటు చేస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదు. నియోజకవర్గ పరిధిలో నిజంగా సమస్య ఉన్న రోడ్లను వదిలేసి.. కాస్తంత గోతులున్న రోడ్లను ఎంచుకుని మరమ్మతులు చేశామని చెప్పి బిల్లులు చేసుకున్నారు. జీఓ 53లో 16 రోడ్ల మరమ్మతులకు రూ.154.9 లక్షలు మంజూరు చేయగా తూతూమంత్రంగా గోతులు పూడ్చి చేతులు దులుపుకున్నారు. జీఓ 348లో ఆరు పనులకు గానూ 30.4 లక్షలు.. జీఓ 349లో 10 రోడ్లు మరమ్మతులకు గాను రూ. 32.2 లక్షలు కేటాయించినా, ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. దీంతో పలు రోడ్లలో రాకపోకలకు సైతం ప్రజలు అవస్థలు పడుతున్నారు. వేపాడ, ఎస్.కోట మండలాల్లో గోతులు పడ్డ రహదారులే అందుకు సాక్ష్యాలు.



నిధులున్నా అభివృద్ధికి నోచుకోని ఆతవ రోడ్డు



గోతులు పడిన వేపాడ - వాయిలపాడు రోడ్డు



సోంపురం - వేపాడ రోడ్డు దుస్థితి



రాళ్లు తేలిన పాత అలుగుబిల్లి రహదారి



బొడ్డవర, దారపర్తి పంచాయతీల్లో గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారి



పెదకండేపల్లి - శృంగవరపుకోట రోడ్డు దుస్థితి



కంకర తేలిన పీకే పల్లి - సుగర్ కాటా రోడ్డు

జిల్లాలో అదనంగా ధాన్యం కొనుగోలు చేయాలి

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న బాబ్జి

విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరం జిల్లాలో ప్రభుత్వం అనుకున్న కొనుగోలు షెడ్యూల్‌కి మించి మరో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌ని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. బుధవారం జేసీని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2024 - 25 సంవత్సరానికిగాను జిల్లాలో 483 ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నేటి వరకు 63,916 మంది రైతుల నుంచి 2,90,330 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి సుమారు రూ.667 కోట్ల చెల్లింపులు చేసారని తెలిపారు. జిల్లాలో ఇంకా ధాన్యం కొనుగోలు పెంచాలని రైతులు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రభుత్వంతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లోక్‌సత్తా పార్టీ నుంచి కొన్ని ప్రాంతాల్లో పర్యటించి ధాన్యం రైతుల సమస్యల అడిగి తెలుసుకున్నామని భీశెట్టి అన్నారు. ప్రభుత్వం వెనువెంటనే పేమెంట్ వేసిందని రైతు ఆనందపడుతూనే కొంతమంది మిల్లర్ల అరాచకాన్ని ఆపడంలో అధికారులు విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని చోట్ల 40 కేజీల బస్తాకు 41 కేజీలు తీసుకున్నారని, 80 గ్రాముల సంచికి అదనంగా 2 కేజీలు తీసుకున్నారని చాలా చోట్ల ఆర్బీకె సిబ్బంది మిల్లర్లకు సహకరించి రైతులకు అన్యాయం చేశారని రైతులు ఆవేదన చెందుతున్నారని భీశెట్టి అన్నారు. మిల్లర్లను కంట్రోల్ చేసే వ్యవస్థ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, రైతులకు నష్టం జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు.

భక్తి చైతన్యయాత్రకు సర్వం సిద్ధం



భక్తి చైతన్య యాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీటీడీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్యామ్ సుందర్ తదితరులు

- టీటీడీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జె.శ్యామ్‌సుందర్

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25న శనివారం నిర్వహించ తలపెట్టిన వెంకటేశ్వర భక్తి చైతన్య యాత్రకు సర్వం సిద్ధం చేసినట్లు టీటీడీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జె.శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ మేరకు టీటీడీ ఆవరణలో బుధవారం వాల్‌పోస్టర్లు, కరపత్రాలు, ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న శనివారం ఉదయం టీటీడీ కల్యాణ మండపం నుంచి భక్తి చైతన్య యాత్ర బయలుదేరి పైడితల్లి ఆలయం వరకూ వెళ్తుందన్నారు. భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్లు, తాళాలతో, భజన సంప్రదాయలతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ కార్యక్రమంలో పాల్గొని తరించాలన్నారు. కార్యక్రమంలో ధార్మిక మండలి పూర్వపు ఉపాధ్యక్షుడు బి.గౌరీనరసింహప్రసాద్, కల్యాణ మండపం ఇన్‌చార్జి ఎస్.వెంకటపతిరాజు, అమ్మానాన్న స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి జి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సైకాలిజిస్ట్‌కు లీడర్ షిప్ అవార్డు



డాక్టర్ ఎస్‌వీఎస్ సూర్యనారాయణ, సైకాలజిస్ట్

విజయనగరం అర్బన్: ఇండియన్ స్కూల్ సైకాలజీ అసోసియేషన్ లీడర్ షిప్ అవార్డుకి పట్టణానికి చెందిన సైకాలజిస్ట్ డాక్టర్ ఎస్‌వీఎస్ సూర్యనారాయణ ఎంపికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు మరియు పుదుచ్చేరి విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ పంచ్ రామలింగం నుంచి ఎంపిక సమాచారం పత్రం వచ్చిందని ఆయన మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైకాలజీ రంగంలో చేసిన విస్తృత సేవలకు, వేలాది మంది విద్యార్థులను వారి లక్ష్య సాధించేందుకు ప్రేరణ ఇచ్చినందుకుగాను ఎంపికయ్యానని తెలియజేసారు. ఈ నెల 24, 25 తేదీల్లో పుదుచ్చేరి విశ్వవిద్యాలయంలో జరిగే రెండవ అంతర్జాతీయ సదస్సులో ఈ అవార్డును పాండిచ్చేరి ప్రజా సమాచార మరియు ప్రసార శాఖ రాష్ట్ర మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ చేతుల మీదుగా అందజేస్తారని తెలిపారు. అవార్డు సాధించినందుకు కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్ తదితరులు అభినందనలు తెలిపారు.

ముగిసిన కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియ



అభ్యర్థులకు ఛాతీ, ఎత్తు పరీక్షలు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

విజయనగరం క్రైమ్: స్టైపెండరీ పోలీసు కానిస్టేబల్ ఉద్యోగ నియామకాలకు మహిళ, పురుష అభ్యర్థులకు నిర్వహించిన పీఎంటీ, పీఈటీ ప్రక్రియ ముగిసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. డిసెంబరు 30 నుంచి జనవరి 22 వరకూ 16 రోజుల పాటు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పరీక్షలు నిర్వహించామన్నారు. బుధవారం 477 పురుష, 158 మంది మహిళా అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని, మొత్తం 5687 మంది పురుష అభ్యర్థులు, 1141 మంది మహిళా అభ్యర్థులు హాజరుకాగా, వారిలో తుది రాత పరీక్షకు 4019 మంది పురుష, 530 మంది మహిళా అభ్యర్థులు అర్హత సాధించారని చెప్పారు. నియామకప్రక్రియలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొని ఎంపిక ప్రక్రియ సజావుగా జరిగేలా విధులు నిర్వహించారు.

పురిటిపెంటలో వైద్యశిబిరం

గజపతినగరం: మండల పరిధి పురిటిపెంట - 2 గ్రామ సచివాలయం పరిధిలోని వెల్‌నెస్ సెంటర్‌లో 104 సిబ్బంది బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మరుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సాయికృష్ణారెడ్డి 83 మంది రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్యసూత్రాలపై అవగాహన కల్పించారు.